ప్రజాశక్తి
మంగళవారం 18 ఏప్రిల్ 2023 5
పార్వతీపురం మన్యం

నేటి నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

పార్వతీపురం : గిరిజన విద్యార్థులకు ఈనెల 18 నుంచి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి బి.సూర్యనారాయణ తెలిపారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత కోచింగ్‌కు టెన్త్ పరీక్షలు రాసిన గిరిజన విద్యార్థిని, విద్యార్థులు అర్హులని ఆయన చెప్పారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ మోడల్ రెసిడెన్సియల్ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కోచింగ్ ఇస్తామన్నారు. టెన్త్ పరీక్షలు రాసిన గిరిజన విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకావాలని కోరారు. సాంకేతిక విద్యశాఖ సంచాలకులు ఆదేశాల మేరకు కోచింగ్ కాలంలో బాలురుకు మాత్రమే ఉచిత వసతి భోజన, సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు తమ పరిధిలో గల 10వ తరగతి పరీక్షలు రాసిన గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు కోచింగ్‌కు హాజరు కావడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కుంటినవలస వద్ద స్థల పరిశీలన చేస్తున్న రాష్ట్ర, కేంద్ర బృందాలు (ఫైల్)

- ఎయిర్‌పోర్టుపై ఉన్న శ్రద్ధ గిరిజన వర్శిటీపై ఏదీ?
- ఏళ్లు గడుస్తున్నా అప్పగించని భూమి
- అరకొర సదుపాయాలతో వర్శిటీ నిర్వహణ
- వసతుల్లేక వెనక్కిపోతున్న విద్యార్థులు

విద్యపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. దీంతో, జిల్లా కూడా వెనుకబాటుకు గురవుతోంది. చివరకు ఆకాశ మార్గంపైవున్న శ్రద్ధ కూడా వర్శిటీ ఏర్పాటుపై చూపకపోవడంతో ఇటు అధ్యాపకులు, అటు విద్యార్థులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. ఈసమస్యలను ఎదుర్కోలేక ఇతర వర్శిటీలకు విద్యార్థులు మళ్లిపోతున్నారు. 2014లె రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్శిటీని తలపెట్టిన విషయం విధితమే. రూ.420కోట్ల యుజిసి (యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్) నిధులతో విద్యాలయ భవన నిర్మాణ పనులకు చేపట్టేందుకు 2015లోనే కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇందుకు అవసరమైన భూమిని అప్పగించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇదే అదునుగా కేంద్ర ప్రభుత్వం కూడా తగినంతగా నిధులు కేటాయించడం లేదు. టిడిపి ప్రభుత్వ హయాంలో కొత్తవలస మండలం రెల్లిలో భూమిని కేటాయించిన విషయం విధితమే. వైసిపి అధికారంలోకి వచ్చాక స్థల మార్పుపేరుతో రెండేళ్లు కాలక్షేపం చేసింది. ఏడాదిన్నర క్రితం మెంటాడ మండలం కుంటినవలస రెవెన్యూ పరిధిలో 561ఎకరాల భూమి కేటాయించారు. భూ సేకరణ ఇప్పటికీ పూర్తిచేయలేదు. ఇదే అదునుగా కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో తాత్సారం చేస్తోంది.

యూనివర్శిటీకి తొలి నాలుగేళ్లూ నిధులు కేటాయించలేదు. ఎట్టకేలకు 2019-20లో ఎపి, తెలంగాణా రాష్ట్రాల్లో తలపెట్టిన గిరిజన యూనివర్శిటీలకు రూ.63లక్షలు కేటాయించినప్పటికీ ఇందులో రూ.32.50 లక్షలు మాత్రమే విజయనగరంలోని వర్శిటీకి దక్కాయి. 2022-23 బడ్జెట్ వరకు ఇదే పరిస్థితి. దీంతో, వచ్చిన మొత్తం వర్శిటీ నిర్వహణకే సరిపోని పరిస్థితి. ఈ ఏడాది (2023-24 బడ్జెట్‌లో) మరీ ఘోరంగా రూ.18.50కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో, గాజులరేగ సమీపంలో పాత ఎయు క్యాంపస్‌లో గిరిజనవర్శిటీ తరగతులు నిర్వహిస్తున్నారు. వర్శిటీలో 200మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం 12కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరికొన్ని కోర్సుల ఏర్పాటుకు అనుమతులు లభించినప్పటికీ వసతి సమస్య వల్ల ముందుకు సాగలేని పరిస్థితి. ఉన్న డిపార్ట్‌మెంట్లకే భవనాలు, గదులు సరిపోవడం లేదు. 12మంది ఫ్యాకల్టీ ఒకే గదిలో కూర్చోవాల్సివస్తోంది. ఇక విద్యార్థుల సమస్యల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. విజయనగరం జిల్లాలో తలపెట్టిన గిరిజన యూనివర్శిటీ భవన నిర్మాణం విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో, అద్దె కొంపలో తరగతులు నిర్వహిస్తున్నారు. వీటిలో లేబొరేటరీ, లైబ్రరీ, ఆటస్థలాలు, జిమ్, పరిశోధనకు అవసరమైన ఇతర సదుపాయాలు లేకపోవడం వల్ల సీతం, ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కాలేజీలు, మాన్సాస్ పరిధిలోని ఎంఆర్ అటానమస్, ఎంఆర్ డిగ్రీ కాలేజీలపై ఆధారపడుతున్నారు.

తరగతులొక చోట, ప్రయోగాలు మరోచోట, పరిశోధనలు ఇంకోచోట జరుగుతుండడంతోవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్శిటీకి హాస్టల్ నిర్వహణకు నిధులు ఉన్నప్పటికీ అందుకు తగ్గ భవనం లేదు. దీంతో, సమీపంలోని సీతం కాలేజీ యాజమాన్యంతో ఒప్పందం కుదుర్చుకుని అక్కడ 100మంది విద్యార్థులకు హాస్టల్ సదుపాయం కల్పించారు. మిగిలిన విద్యార్థులు అక్కడ కూడా ఉండేందుకు అవకాశం లేకపోవడంతో ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు వెనుదిరుగుతున్నారు. జర్నలిజం విభాగంలో గత ఏడాది 18మంది చేరగా వసతి, తరగతి గదులు, లైబ్రరీ, లేబొరేటరీ వంటి సదుపాయాలు లేకపోవడంతో 15మంది ఇతర వర్శిటీలకు వెళ్లిపోయారు. ఇక సెమినార్ హాళ్లు, ఆట స్థలాలు, సెంట్రల్ లైబ్రరీ వంటి సదుపాయాల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. గిరిజన ప్రాంతాలపై పరిశోధనలు అనే మాటే లేదు. దీంతో, గిరిజన వర్శిటీ లక్ష్యం నీరుగారుతోంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఎయిర్‌పోర్టు, గిరిజన విశ్వవిద్యాలయాలకు శంకుస్థాపన చేస్తారని ప్రకటించడంతో ఇన్నాళ్లకైనా మోక్షం కలుగుతుందని చాలా మంది భావించారు. ఆచరణలో అటువంటిదేమీ కనిపించలేదు. తాజాగా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పనులకు శంకుస్థాపన చేసేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి వస్తున్నట్టు ఇటీవల మంత్రులు ప్రకటించినప్పటికీ గిరిజన వర్శిటీ విషయమై మాట్లాడకపోవడంతో విద్యావంతుల్లో తీవ్ర నిరాశ, అసహనం వ్యక్తమౌతోంది. ఇప్పటికైనా భూ సేకరణ పూర్తిచేసి, కేంద్రానికి అప్పగించాలని కోరుతున్నారు.

స్పందనకు 80 దరఖాస్తులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 80 దరఖాస్తులు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వాటిలో కొన్ని...

బలిజిపేట మండలం గళావిల్లికి చెందిన బోను సత్తెమ్మ తన స్థలం విషయమై కోర్టులో కేసు ఉండడంతో ఆ స్థలంలో ఎటువంటి కట్టడాలు జరగకుండా నిలిపివేస్తూ కోర్టులో పెండింగులో కేసు ఉండగా అనుమతులు ఇచ్చిన రెవెన్యూ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తప్పుడు ఫిర్యాదులు చేస్తూ తమ గ్రామంలో లేనిపోని తగువులు పెడుతూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూయున్నారు వారి పై చర్యలు తీసుకోవాలని మామిడి శ్రీకాంత్ అర్జీ అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం దిబ్బలగూడకి రోడ్డు సదుపాయం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కావున కల్లటి నుండి దిబ్బలగూడా వరకు సిసి రోడ్డు మంజూరు చేయాలని సీమల సుబ్బారావు, గ్రామస్తులు, దరఖాస్తు అందజేశారు. ఇదే మండలం కేసరిగూడకు తాగునీరు, కేసరి నుంచి కేసరగూడ వరకు రహదారిని, వీధి కాలువలు నిర్మించాలని పి.రామారావు, గ్రామస్తులు వినతిని అందజేశారు. పార్వతీపురం మండలం పెదమరికి గ్రామపంచాయతీ నిధులను కొందరు దుర్వినియోగం చేశారని, వారితో రికవరీ కట్టించి చర్యలు తీసుకోవాలని బి.జనార్ధన రావు, ఇతరులు కోరారు. కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురానికి చెందిన ఎన్.సురేష్ ఆర్‌బికె ధాన్యం కొనుగోలు కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు కొనసాగిస్తున్నానని, మూడు నెలలుగా జీతం రావడంలేదని దరఖాస్తు అందజేశారు. పార్వతీపురం పట్టణం వేమకోటి వారి వీధి 26వ వార్డుకు మూడు నెలలుగా నిత్యవసర సరుకులు సక్రమంగా అందడం లేదని దాసరి మంగమ్మ, వార్డ్ మెంబర్స్ అర్జీ అందజేశారు. పార్వతీపురం మండలం మెల్లికవలసకు మెల్లికు సర్వే నంబర్ 121 డోకిశీల పంచాయతీలో గత 80 ఏళ్లుగాసాగు చేసుకుంటున్నానని, ఆ భూమికి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించవలసిందిగా కోరారు. సాలూరుకు చెందిన కె.నవీన్ కుమార్ తన భార్య మరణించి తొమ్మిదేళ్లయినా మరణ ధ్రువీకరణ పత్రం

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

మంజూరు కాలేదని, తక్షణమే ఇప్పించాలని కోరారు. భామిని మండలం కోరమ గ్రామానికి బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ ఎ.రఘుపతి నాయుడు, గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. సీతానగరం మండలం జోగింపేట గ్రామానికి మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని కె.సింహాచలం, గ్రామస్తులు కోరారు. స్పందన కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సీతంపేట ఐటిడిఎలో...

సీతంపేట : సవరభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలని స్పందనలో కార్యక్రమంలో సవరభాష వాలంటీర్ల సంఘం నాయకులు డుంబు ఆనందరావు వినతిపత్రం సమర్పించారు. సోమవారం స్పందన కార్యక్రమం ఐటిడిఎలో ఎపిఒ రోసిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మెట్టిగూడకు చెందిన సవర బూధమ్మ టార్పన్లు మంజూరు చేయాలని కోరారు. జక్కెరగూడకు చెందిన మచ్చయ్య వైఎస్ఆర్ ప్రమాద బీమా డబ్బులు మంజూరు చేయాలని కోరారు. తుంబన్న కాలనీకి చెందిన సురేష్ తాగునీటి సదుపాయం కల్పించాలని, వలగెడ్డకు చెందిన రేవతి కుట్టు మిషన్ మంజూరు కోరారు. బంజరగూడకు సోమయ్య కమ్యూనిటీ పట్టా మంజూరు చేయాలని కోరారు. స్పందన కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎడ్యుక్యూట్ ఇంజనీర్ జి.మురళి, సిడిపిఒ రంగలక్ష్మి, హెచ్ఒ అమరేశ్వరి, జిసిసి డిఎం సంధ్యారాణి ఐటీడీఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్ జాకప్ దయానంద్, ఎఎంఒ కోటి బాబు తదితరులు పాల్గొన్నారు

గురుకుల పాఠశాలను సందర్శించిన సబ్‌కలెక్టర్

సీతంపేట :మండలంలోని గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ సందర్శించారు. లైబ్రరీ పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి బుక్స్ లైబ్రరీలో ఉన్నాయని ఆరా తీశారు. నాణ్యమైన విద్యను అందించాలన్నారు. అనంతరం దిబ్బగూడలో గల పసుపు ప్రోసింగ్ యూనిట్లను పరిశీలించారు దానిని ద్వారా వచ్చిన పసుపు ను ఏ విధంగా మార్కెటింగ్ చేస్తున్నారో ఆరా తీశారు. ఈయనతో పాటు తహశీల్దార్ నరసింహమూర్తి ప్రిన్సిపాల్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు



కాలేజీలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ మీనాకుమారి

'ఫ్యామిలీ డాక్టర్'ను సక్రమంగా నిర్వహించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను సక్రమంగా నిర్వహించాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. సోమవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా స్థాయి వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీలో మాతా, శిశు మరణాలు లేకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గిరిజన గ్రామాల్లో ఎక్కువగా ఉండే ఎనిమియా వ్యాధిపై దృష్టి పెట్టాలని అన్నారు. పిహెచ్‌సిల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. పిహెచ్‌సిలో తరచూ పర్యవేక్షించాలని డిఎంహెచ్‌ఒలను ఆదేశించారు. సీతంపేట ఏరియా ఆసుపత్రి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాన్ని కూడా త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా పిహెచ్‌సి సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన వికాస్ యోజన కార్యక్రమం సక్రమంగా జరగాలన్నారు. ప్రతి గ్రామంలో మలాథియన్ స్ప్రే తరుచుగా నిర్వహిస్తుండాలని మలేరియా సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బంది ద్వారా క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. బర్త్ వెయింట్ హోంలు తిరిగి కొనసాగేలా చర్యలు తీసుకొంటామని తెలిపారు. నాడు నేడు పనులు ఇంకా పూర్తి కాని పిహెచ్‌సిల్లో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల డిఎంహెచ్‌ఒలు బి.జగన్నాథరావు, మీనాక్షి, శ్రీకాకుళం డిసిహెచ్ ఎస్.భాస్కరరావు, డిఎంఒలు శ్యామ్, సత్యనారాయణ, ఎపిఎంఐడిసి ఇఇ, ఎపిఒ రోసిరెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ బి శ్రీనివాసరావు, డిపిఒ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఇటీవల పదవీ బాధ్యతను స్వీకరించిన ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌ను సోమవారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఎస్‌పిని కలిసి మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రతిపక్ష పార్టీల ప్రాథమిక హక్కులను కాపాడుతూ, తమకు పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

294 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వేర్వేరు చోట్ల ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న 294 కేజీల గంజాయి పట్టుబడినట్లు సిఐ సింహాద్రి నాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పందిరప్పన్న జంక్షన్ వద్ద కారులో గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో నిఘా పెట్టి 124 కేజీల గంజాయితో పాటు తమన్ జావేద్, సోఫికల్ అబ్దుల్, అజీమ్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్‌లు, రూ.71వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. అరకులో గంజాయిని కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. అలాగే స్థానిక దేవీ జంక్షన్ వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా కారులో 170 కేజీల గంజాయి లభించింది. దీంతో గంజాయితో పాటు రాజస్థాన్‌కు చెందిన బారులాల్, రోషల్‌మాలీని అదుపులోకి తీసుకొని రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఫ్యామిలీతో ఉంటే కారును చెకింగ్ చేయకుండా వదిలేస్తారని ఆలోచనతో రెండు ఘటనల్లోను దొరికిన అయిదుగురు వ్యక్తులలో ఒకరు మహిళ కావడం ఆమె మూడేళ్ల బాబు, ఐదేళ్ల పాపతో గంజాయి రవాణా కారులో ఉండడం గమనార్హం. ఇదిలా ఉండగా బొడ్డవరం వద్ద గంజాయి తనిఖీకి చెక్ పోస్టులు ఉన్నప్పటికీ ఆ చెక్‌పోస్టు దాటి పట్టణ పరిసర ప్రాంతాల్లో పట్టు పడడం అనుమానాలకు తావిస్తోంది. గంజాయిని పట్టుకున్న వారిలో ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

కలెక్టరేట్ వద్ద నాగు పాము కలకలం

ప్రజాశక్తి-విజయనగరం

కలెక్టరేట్ లో నాగుపాము కలకలం రేపింది. సోమవారం ఉదయం 10గంటల సమయంలో కలెక్టరేట్ లోని డిఇఒ కార్యాలయం ముఖద్వారం వద్ద నాగుపాము కనిపించింది. జనసంచారంతో అది పడగవిప్పడంతో కార్యాలయాలకు వచ్చిన అధికారులు, సిబ్బంది నివ్వెర పోయారు. వెంటనే పాములు పట్టేవారికి సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. పాము దేనినో తినేసి కదలలేని పరిస్థితిలో ఉండడంతో వెంటనే దాన్ని పట్టుకొని ఒక సీసాలో బంధించారు. పామును అటవీశాఖ అధికారులకు అప్పగిస్తామన్నారు.

మతోన్మాద బిజెపిని సాగనంపాలి

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజా వ్యతిరేక, నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం-దేశాన్ని కాపాడుకుందాం అంటూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సీతంపేట మండల కేంద్రంలో సంతలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఆరిక భాస్కరరావు మాట్లాడుతూ రాజ్యాంగ ప్రత్యేక హెూదా, విభజన హామీలు, సామాన్య ప్రజలు రక్షణ ప్రధాన కర్తవని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జె.శ్రీరాములు, పాలక సాంబయ్య, బిడ్డిక అప్పారావు, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద, బిజెపిని గదించాలని సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రచారభేరి జరిగింది. ఆదివారం రాత్రి పట్టణంలోని మూడో వార్డు వివేకానంద కాలనీ వీధుల్లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బిజెపి నిరంకుశ విధానాలపైన, దేశ సమైక్యత, సమగ్రత, రాజ్యాంగ విలువల పరిరక్షణకి పోరాడాలని, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజెపిని, దానికి సహకరించే శక్తులను వ్యతిరేకించాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, కమిటీ సభ్యులు బి.సూరిబాబు, ఎస్.చిన్నరావు, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

సీతానగరం : బిజెపి పాలనతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కావున ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బక్కుపేట, పెదబోగిలిలో ప్రచారభేరి నిర్వహించారు. అందులో భాగంగా గ్రామాల్లో నిర్వహించి సభ నిర్వహించారు. సభలో ఈశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సామాన్యులపై గ్యాస్ బండను గుదిబండ చేశారన్నారు. పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకులు ఆకాశాన్ని అంటాయన్నారు. అలాగే రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్నా మోడీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేని దౌర్భాగ్యస్థితిలోకి అధికార, ప్రతిపక్షాలు ఉన్నాయని విమర్శించారు.

సాలూరు : బొర్రపనుకువలసలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గవర వెంకటరమణ, వై.రామారావు, పి.చిన్నారావు, ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మండలంలోని గంగభద్ర, రాజ్యలక్ష్మీపురం కోనవలస, కొమ్మరకుంటలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.సింహాచలం, లక్ష్మయ్య, కెవిపిఎస్ నాయకులు పెంటయ్య, రాములు గడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మోడీని గద్దింపండి... దేశాన్ని కాపాడండంటూ సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరీ కార్యక్రమం నార్లవలస పంచాయతీ బొర్రపను కువలస, అన్నంరాజువలస పంచాయతీ తుపాకవలసలో జరిగింది. సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం పేదలపైన కార్మికులు, కర్షకులు పైన అన్ని విధాలా దాడులు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పి గద్దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.సుందర్రావు, జి.గాసి తదితరులు పాల్గొన్నారు.

సిటీయుకు సొంత హాస్టల్ కేటాయించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరంలో గల కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో మౌళిక వసతులు కల్పించాలని, సొంత హాస్టల్ కేటాయించాలని కోరుతూ విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కళాశాలకు సొంత హాస్టల్ సదుపాయం లేకపోవడంతో ప్రయివేటు హాస్టల్‌లో విద్యార్థులు ఉంటున్నారని అన్నారు. అక్కడ మెస్ ఛార్జీలు విద్యార్థులకు భారంగా ఉన్నాయని, భోజనం కూడా సరిగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. యూనివర్సిటీ కి సొంత హాస్టల్ సదుపాయం కల్పించాలని , మెస్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని , హాస్టల్ ఫీజు తగ్గించాలని కోరారు. విసి అందుబాటులో లేకపోవడంతో ఎఒ ఇచ్చిన హామీతో ఆందోళన విరమించారు. సమస్యలు పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉమ, దీపిక, మోహన్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

109 మంది మందుబాబులపై కేసులు

ప్రజాశకి - పార్వతీపురంటౌన్

గత నాలుగు రోజులుగా పార్వతీపురం పట్టణం, రూరల్ సీతానగరం, కొమరాడ, పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందు బాబులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సిఐ కృష్ణారావు సోమవారం విలేకరులకు తెలిపారు. పార్వతీపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు చేయడంలో భాగంగా గత 4 రోజులుగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిని అదుపు చేశామన్నారు. పట్టణ పోలీసులు 29 మంది వ్యక్తులపైనా, ట్రాఫిక్ పోలీసులు 22 మంది పైనా, రూరల్ పోలీస్ స్టేషన్, సీతానగరం, కొమరాడ, బలిజిపేట పోలీస్ స్టేషన్ల పరిధిలో 58 మంది వ్యక్తులపైన కేసులు నమోదు చేశామన్నారు. పోలీసు సిబ్బదితో పార్వతీపురం పట్టణ, చుట్టుపక్కల ప్రాంతాల్లో గస్తీని పెంచి సాయంత్రం వేళల్లో మహిళలను, ఆడపిల్లలను వేధించే ప్రదేశాలను గుర్తించి ఆకతాయిలను, మందు బాబులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

గుమ్మ లక్ష్మీపురం: ఎల్విన్‌పేట, కురుపాం పోలీస్ స్టేషన్ల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 24 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. ఎవరైనా క్రమశిక్షణ రాహిత్యంగా ప్రవర్తించినా, ఈవిటీజింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామనీ సిఐ సత్యనారాయణ హెచ్చరించారు.

జియ్యమ్మవలస : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని చినమేరంగి ఎస్సై జి.కళాధర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ తిరగొద్దన్నారు.

కురుపాం : బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై సిహెచ్ ప్రసాద్ అన్నారు. సోమవారం రావాడ జంక్షన్ సమీపంలో గల కల్లాం వద్ద మద్యం సేవిస్తుండగా పట్టుబడ్డ నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవించినట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు .కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన
-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-
విజయనగరం కంటోన్మెంట్, కలెక్టరేట్, విజయనగరం రూరల్, చీపురుపల్లి రూరల్, గరివిడి రూరల్, కొత్తవలస రూరల్, రాజాం రూరల్, గజపతినగరం రూరల్, సంతకవిటి రూరల్, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి రూరల్
ఇంటర్వ్యూ : తేది: 24-04-23 సోమవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099156, 8331011960
ప్రజాశక్తి కార్యాలయం
విశాల్‌మార్ట్ ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం

కొత్తగూడలో జ్వరాల పరిస్థితిని తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ

కొత్తగూడ, దేవనాపురంలో డిఎంహెచ్ఒ పర్యటన

సీతంపేట: మండలంలో కొత్తగూడ, దావనాపురం సచివాలయాల్లో గ్రామాలను సోమవారం డిఎంహెచ్ఒ బగాది జగన్నాధరావు సందర్శించారు. జ్వరాలపై ఆరా తీశారు. రోగుల పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో పరిశీలించారు. ఈ కాలంలో అప్రమత్తంగా ఉండాలని, కలుషిత జలాలు తాగరాదని సూచనలు, సలహాలు ఇచ్చారు. రోగులకు వైద్య సేవలు సకాలంలో అందించాలన్నారు, ఆయనతో పాటు దోనుబాయి వైద్యాధికారి భాను ప్రతాప్ తదితరులు ఉన్నారు

విద్యార్థులకు, సిబ్బందికి కరపత్రాలు అందజేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పార్వతీపురం టౌన్ : అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఎఫ్ఒ యు.సుధాకరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా సోమవారం చాకలి బెలగాంలోని ఏకలవ్య పాఠశాలలో అగ్నిమాపక సిబ్బంది వివిధ రకాలైన అగ్ని ప్రమాదాలు సంభవించే వేళ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఫైర్ డెమో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా వాటిని నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగిన ఎడల అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు గోడపత్రికలపై ముద్రించి, డెమోలో పాల్గొన్న వారికి అందజేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ఎల్.ఎఫ్ ఎ.రమేష్, ఎల్.ఎఫ్ బి. ప్రసాద రావు, డి/ ఓ.పి ఎల్. మోహన్ కుమార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కాలేజీలో చేర్పించాలి

సీతానగరం : విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ప్రిన్సిపల్ బి.రేణుక కోరారు. మండలంలోని సీతానగరం, అప్పయ్యపేట, బుద్దిపేట, పెదభోగిలిలో సోమవారం టెన్త్ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని, విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక వసతులు కల్పించిందని అన్నారు. కాలేజీలో గ్రంథాలయం, అన్ని రకాల వసతులు కల్పించినట్టు తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఐఐటి, ఎంసెట్, తదితర పోటీ పరీక్షల్లో ర్యాంకులు సంపాదించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.రామకృష్ణ రవికుమార్, ఆర్.రామారావు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

మధ్యాహ్న భోజనం పథకం పరిశీలన

సీతానగరం : మండలంలోని లచ్చయ్యపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఒ ఎంఎస్ఎవిఎం ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని విద్యార్థులకు సక్రమంగా అందించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మెను ప్రకారం ప్రతిరోజూ ఆహారం అందించాలని అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కెకె వర్మ, పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు వేస్తున్న సిబ్బంది

విద్యుత్ స్తంభం ఏర్పాటు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

వీరఘట్టం : మండలంలోని రేగులపాడులో సోమవారం నేలకొరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. ఈనెల 16న పది రోజులుగా విద్యుత్ బంద్ 'ప్రజాశక్తి' అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో రేగులపాడు గ్రామస్తులు ప్రజాశక్తికి, అధికారులకు అభినందనలు తెలిపారు.

ట్రాక్టర్లు పంపిణీ

భామిని : వైఎస్ఆర్ యంత్రం సేవా పథకం ద్వారా మండలంలోని నల్లరాయిగూడ, జయంతి సిహెచ్ సి గ్రూప్‌నకు స్వరాజ్ ట్రాక్టర్, స్వరాజ్ కోడ్, బొడ్డగూడలో ఆదివాసీ సిహెచ్‌సి గ్రూప్‌నకు స్వరాజ్ ట్రాక్టర్, రోట వేటర్, కల్టివేటర్, నులకజోడులో విగ్నేశ్వర సిహెచ్‌సి గ్రూప్‌నకు స్వరాజ్ ట్రాక్టర్, కల్టివేటర్‌ను వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నకుమారి సోమవారం అందజేశారు. వైఎస్ఆర్ యంత్ర సేవ పథకంలో భాగంగా 50 శాతం డిసిసిబి రుణం, 40 శాతం సబ్సిడీతో లబ్దిదారులకు అందజేశామని మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో నులకజోడు సర్పంచ్ కొత్తూరు ప్రసాదరావు, వ్యవసాయ సహాయకులు ఎర్రన్న ఉన్నారు.

యాంత్రీకరణ పరికరాలను రైతులకు అందజేస్తున్న వ్యవసాయశాఖాధికారులు

పాండ్రలో సమస్యల తిష్ట

అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో మారుమూల గిరిజన గ్రామాల్లో ఒకటి పాండ్ర. ఈ గ్రామంలో అన్ని రకాల సమస్యలు తిష్ట వేశాయి. గిరిజనులకు కనీస సౌకర్యాలు లేక సమస్యలతో సతమతం అవుతున్నారు. మండలంలో కొండాడ పంచాయతీ పాండ్రలో 42 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తమకు జగనన్న గృహాలు మంజూరు కాలేదని గ్రామస్తుడు గొలియా మల్లయ్య తెలిపారు. కనీసం సిసి రోడ్లు లేవని, దీంతో మురికినీరు, వర్షం నీరు కాలువ లేక రోడ్డుపైనే ప్రవహిస్తుందని తెలిపారు. వర్షాకాలంలో కొండలపై నుంచి వచ్చే వర్షం నీరు నేరుగా గ్రామంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వరదగోడ మంజూరు చేయాలని కోరారు. అలాగే రాత్రి వేళల్లో ఏ విషపూరిత జంతువులు వస్తాయోనని, కనీసం వీధిలైట్లు లేకపోవడంతో గిరిజనులు రాత్రివేళ రోడ్డుపైకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని అన్నారు. అలాగే గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఉన్నప్పటికీ అది మరమ్మతులకు గురైందని, బోరు బావులు కూడా లేవని తెలిపారు. దీంతో గెడ్డనీరు తెచ్చుకొనేందుకు సొంత ఖర్చుతో పైప్ లైన్లు వేసుకొని నీరు తెప్పించుకుంటున్నామని తెలిపారు. కానీ కొన్ని సందర్భాల్లో నీరు తక్కువ వస్తుందని 'ప్రజాశక్తి' వద్ద వాపోయారు. ఇక్కడ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్న పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బాపన్నగూడకు పిల్లలను తల్లిదండ్రులు తీసుకుని వెళ్తున్నారు ఆందోళన వ్యక్తం చేశారు. కావున తమ గ్రామంలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు

రోడ్డు, కాలువలకు నోచుకోని పాండ్ర గ్రామం

సిసి రోడ్లు, కాలువలు మంజూరు చేయాలి

గ్రామంలో సిసి రోడ్లు, కాలువలు మంజూరు చేయాలి. తాగునీరందక చాలా ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలపై ఇప్పటికే స్పందనలో పలుమారులు వినతులు సమర్పించాం. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తెలియజేశాం. అయినా ప్రయోజనం లేదు. అలాగే మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

సవర ఓమిని,
గిరిజనుడు, పాండ్ర.

భీంపురంగెడ్డపై వంతెన నిర్మించాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం, వబ్బంగి పంచాయతీల మధ్య ఉన్న భీంపురం గెడ్డపైవంతెన నిర్మించాలని గిరిజన సంఘం నాయకులు ఎ.చంద్రశేఖర్, ఐ.రామకృష్ణ ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణకు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వంతెన లేకపోవడం వల్ల వర్షాకాలంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ఈ వంతెన నిర్మిస్తే చుట్టుపక్కల 40 గ్రామాల ప్రజలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వర్షాకాలంలో గెడ్డ పెద్దగా వస్తే అత్యవసర సమయంలో ఈ గెడ్డ దాటలేని పరిస్థితుల్లో చాలామంది ప్రాణాలు విడిచే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కావున ప్రాజెక్ట్ అధికారి స్పందించి వంతెన మంజూరు చేయాలని కోరారు. అలాగే కురుపాం మండల కేంద్రంలో గల ఇండియన్ పెట్రోల్ బంకులో పెట్రోలు నాణ్యత లేకపోవడమే కాకుండా తక్కువ వేస్తున్నారని, సంబంధిత అధికారులచే దర్యాప్తు చేయించి వాహన చోదకులకు నాణ్యమైన పెట్రోలు అందించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు దుక్క సీతారం, కోలక గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కళాశాలలు ఏర్పాటు చేయాలని వినతి

కలెక్టరేట్ : పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గిరిజన జూనియర్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం ఈ ఐటిడిఎ పరిధిలో బాలికలకు 3, బాలురకు 2 గురుకుల జూనియర్ కళాశాలలు మాత్రమే ఉన్నాయని, గతంలో కొమరాడ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనలు అమలు చేయాలని విజ్ఞప్తి చేవారు. అలాగే 10 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలనే ప్రతిపాదనలు కూడా అమలు చేయాలని కోరారు. అలాగే ఐటిడిఎ, జిల్లా కేంద్రమైన పార్వతీపురంలో అదనంగా బాలికలకు 1, బాలురకు 1 కళాశాల వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు పిఒ సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడుతానని తెలిపినట్లు రంజిత్ కుమార్ తెలిపారు.

పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎంపి మాధవి, ఎమ్మెల్యే జోగారావు

ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటున్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు, అరకు ఎంపి గొట్టేటి మాధవి ప్రజలను కోరారు. పట్టణంలోని 12వార్డులో సోమవారం జగనన్నే మా భవిష్యత్తు - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చేపట్టారు.. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైసీపీ నాయకులతో కలిసి ఎంపి, ఎమ్మెల్యే ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో చేకూరిన లబ్ధి, ప్రజలు పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వంలో ప్రజలు మోసపోయిన వైనాన్ని, మోసగించిన విధానాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల పూర్తి మద్దతుతో ఇంటి తలుపుపై, గోడపై జగనన్నే మా భవిష్యత్తు అనే స్టికర్, ఫోన్ పై స్టిక్కర్ను అతికించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్ తాడ్డి అరుణ శంకర్రావు, జేసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కో ఆప్షన్ సభ్యులు, ఎఎంసి సభ్యులు, వైసీపీ సీనియర్ నాయకులు, వైసీపీ కార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పాచిపెంట : పేదల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు అన్నారు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం సర్పంచ్ అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్లు గృహసారథులు స్థానిక నాయకులతో కలిసి సోమవారం గోగాడ వలస, కోడి కాళ్ళ వలసలో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులు, లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ ఫలాలు, పాలనా విజయాలను ప్రజలకు వివరించారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి - కొమరాడ

వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరిస్తున్న డిఐఒ జగన్మోహనరావు

వేసవిలో ప్రబలే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన చంద్రంపేట, పరశురాంపురంలో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న వారిని సోమవారం సందర్శించి వారితో మాట్లాడారు. వారి వెంట తాగునీరు తీసుకువచ్చినదీ, లేనిదీ పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవి జాగ్రత్తల పట్ల అందరికీ అవగాహన కల్పించి అప్రమత్తం చేశారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుందని ముఖ్యంగా వృత్తి రీత్యా బయట ప్రాంతాల్లో, ఎండలో పనిచేసే వారికి మరింతగా ప్రభావం చూపుతుందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. వడదెబ్బకు గురయ్యేటప్పుడు చర్మం పొడి బారడం, తలనొప్పి, వికారం, స్పృహ కోల్పోవడం సంభవిస్తాయని, అలాంటప్పుడు గురైన వ్యక్తిని వెంటనే దగ్గర ఉన్న నీడ ప్రాంతంలో ఉంచి, తడి గుడ్డతో శరీరం తుడవాలని, గాలి తగిలేలా చూడాలని, స్పృహ లో ఉన్నప్పుడు మాత్రమే నీరు ఇవ్వాలని సూచించారు. తదుపరి ఒఆర్ఎస్ ద్రావణం ఇచ్చి తీవ్రతను బట్టి దగ్గరలో ఉన్న ఆసుపత్రిలో చేర్చాలన్నారు. వృత్తి రీత్యా గానీ, ఏదైనా పనిమీద బయటకు వెళ్లే ముందు నీరు, మజ్జిగ, నిమ్మరసం మొదలగు ద్రావణాలను తాగాలన్నారు. అలాగే నీరు వెంట తీసుకువెళ్లాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం 11 - 3 గంటల మధ్య బయట తిరగరాదని సూచించారు. పనులు ముగించాక చల్లని నీటితో స్నానం చేయాలని సూచించారు. లేత రంగు దుస్తులు ధరించాలని, ఇవి ఉష్ణోగ్రత లను తక్కువగా గ్రహిస్తాయని, టోపీ లేదా గొడుగు ఉంచుకోవాలని, దాహం వేసే వరకూ వేచి ఉండకూడదని ఎప్పటికప్పుడు నీరు, మజ్జిగ, నిమ్మరసం, బార్లీ మొదలగు ద్రావణాలను ఇంటిలో అందుబాటులో ఉంచుకొని తాగాలన్నారు. డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటామని, మూత్రం పసుపు రంగులో ఉంటే డీ హైడ్రేషన్‌కు సూచన కావచ్చని అన్నారు. సాధ్యమైనంత వరకు నీటి శాతం సమృద్ధిగా లభించే ఆహారం తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు, వృద్దులు, గర్భిణీల పట్ల మరింత జాగ్రత్త తీసుకోవాలని, ఇంటి నివాసాల్లో గాలి బాగా తగిలేలా చూసుకోవాలని అన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎప్పటికప్పుడు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని, ఒఆర్ఎస్, జింక్ కార్నర్‌ను ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి డిఐఒ జగన్మోహనరావు సూచనలు చేశారు. కార్యక్రమంలో పిహెచ్ ఎన్.విజయకుమారి, సూపర్ వైజర్ జయగౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్లు కనకరాజు, నాగరాజు వైద్య సిబ్బంది ప్రమీల, లత, ఆశా కార్యకర్తలు, సి హెచ్ డబ్ల్యు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి

సాలూరు : భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలు గురించి రైతులు తెలుసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి మధుసూదనరావు చెప్పారు. పట్టణం పరిధిలోని బంగారమ్మ పేట రైతు భరోసా కేంద్రం పరిధిలో మండల స్థాయి భూసార పరీక్షా విధానంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎడి మధుసూదనరావు మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల ఏ నేలలో ఏ లోపం వుందో తెలుసుకోవచ్చునని చెప్పారు. పంట వేయడానికి ముందు భూసార పరీక్ష చేయించుకుంటే రైతు పండించే పంటకు ఏఏ ఎరువులు వాడవచ్చునో తెలుస్తుందన్నారు. ఆశించిన దిగుబడి సాధించడానికి కూడా భూసార పరీక్షలు ఉపయోగపడతాయని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎఓ అనురాధ పండా, ఎఇఒలు పాల్గొన్నారు.

చంద్రబాబు గుర్తించినా వీరు గుర్తించరట..!

ప్రజాశక్తి - మక్కువ

తెలుగుదేశం పార్టీ బలోపేతానికి జాతీయ అధ్యక్షులు అన్ని విధాలా కృషి చేస్తుండగా, నియోజకవర్గ స్థాయి నాయకులు మాత్రం గ్రూపులతో ముందుకెళ్తున్నారని, సాక్ష్యాత్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడే తనను గుర్తించి పార్టీలో చేర్చుకుంటే నియోజకవర్గ నాయకులు మాత్రం గుర్తించడంలేదని మండల టిడిపి మాజీ అధ్యక్షుడు పెంట తిరుపతిరావు అన్నారు. మండలంలోని పనసభద్ర పంచాయతీ ఎర్ర సామంత వలస సమీపాన తన ఆయిల్ పామ్ తోటలో టిడిపి శ్రేణులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. శంబర ఎంపిటిసి సభ్యులు టి.పోలినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరుపతిరావు మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు తనను గుర్తించినప్పటికీ సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గ్రూపులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతం కాకుండా వైసిపి నాయకులతో లోపాయికార బంధం కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశానికి ప్రజలను రానీయకుండా పలువురికి ఫోన్లు చేయడమే వారి బంధాన్ని తెలియజేస్తుందని అన్నారు. అధిష్టానం సాలూరు నియోజకవర్గంలో ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రెండు జిల్లాల్లో బొబ్బిలి, విజయనగరం మినహా ఏ ఒక్క నియోజకవర్గంలోనూ అధిష్టానం ఇప్పటివరకు ఎమ్మెల్యే అభ్యర్థులను సూచించలేదని ఈ సందర్భంగా తెలిపారు. పండుగలు, పబ్బాలకు మాత్రమే నియోజకవర్గాల్లో పర్యటిస్తారని, ప్రజా సమస్యలపైనా, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈరోజుకీ పర్యటించలేదని ఆయన విమర్శించారు. తనకు టెక్కెట్టు వస్తుందో లేదో తెలియని పరిస్థితిలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉన్నప్పటికీ, తమకే టికెట్ కేటాయించారని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిజెపికి చెందిన ఎ.వెంకటంపేట ఎంపిటిసి సభ్యులు డి.సాయిబాబు తన వర్గీయులతో టిడిపిలో చేరారు. అలాగే కోన మాజీ ఎంపీటీసీ భర్త రామకృష్ణ అనుచరులు వైసిపి వీడి టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దాకేటి దేవకీ పరమహంస, మేళాపు శ్రీనివాసరావు, బలగ రామకృష్ణ, సిహెచ్ బుచ్చినాయుడు, భాస్కరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో తిరుపతిరావు

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

మంత్రజోలల ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి

నాలుగేళ్ల పాలనలో వైసిపి విఫలం

గుమ్మలక్ష్మీపురం : నాలుగేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి విమర్శించారు. మండలంలోని చినగీసాడ పంచాయతీ మంత్రజోలలో ఇదేంఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో పూర్తిగా ప్రజలను సంక్షోభంలోకి నెట్టారని ఆరోపించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల బతుకులు బాగుండాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. 2024 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కిల్లక దాసు, యూనిట్ ఇంచార్జీ కోటేశ్వరరావు, సోమేశ్వరరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి అడ్డాకుల నరేష్, తెలుగు మహిళా సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వేతలు తీర్చండి

పార్వతీపురం టౌన్ : ఉపాధి వేతనదారుల వెతలు తీర్చాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్‌ను కలిసి జిల్లాలోని ఉపాధి వేతనదారుల సమస్యలపై చర్చించారు. ఇటీవల ఎండలు తీవ్రంగా ఉన్నాయని, దీంతో రెండు పూటలా ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు వడదెబ్బకు గురవుతున్నారన్నారు. కాబట్టి ఎండలు అధికంగా ఉన్నంతకాలం ఒక్క పూట ఉపాధి పనులు నిర్వహించాలన్నారు అలాగే మట్టి గట్టిగా ఉండటంతో పనులు జరగడంలేదని కొలతలతో సంబంధం లేకుండా కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఉపాధి పనుల వద్ద టెంట్లు, మజ్జిగ, మంచినీరు, ఓఆర్ఎస్, మందులు, తదితర వసతులు కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల ఆగడాలను అరికట్టాలన్నారు. కఈ సందర్భంగా ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ వీటిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. పిఒను కలిసిన వారిలో జనసేన నాయకులు వి.దాలినాయుడు, రాజాన రాంబాబు, మండల శరత్ కుమార్, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, రౌతు బాలాజీ నాయుడు, వెళ్లంకి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బిల్లుల చెల్లింపులపై దృష్టి సారించాలి

భామిని : మండలంలోని హౌసింగ్ బిల్లుల చెల్లింపులపై దృష్టిసారించాలని ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం సంబంధిత అధికారులను కోరారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ అంశంపై సింహాచలంతో పాటు జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్‌రావు హౌసింగ్ ఎఇ ఎల్ ప్రభాకరరావుతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సొంత స్థలాల్లో గృహ నిర్మాణానికి 662, జగనన్న లే అవుట్లలో 328, పిఎంఎవై కింద 851 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మండలంలో 89 మందికి రూ.30వేలు చొప్పున ఎస్‌హెచ్‌జి ద్వారా రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. కొంత మేరకు గృహ నిర్మాణం చేసిన వారికి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించాలని కోరారు. సొంత ఇళ్ల స్థలాలుండి ఇంటి కోసం దరఖాస్తు చేస్తే మంజూరు అయ్యేలా చూడాలని తెలిపారు. నిధులు విడుదల అయ్యిన వెంటనే పెండింగ్ హౌసింగ్ బిల్లులు పూర్తి చేస్తామని, గతంలో ఇళ్లు మంజూరై కట్టుకోలేని వారి ఐడిని డిలేట్ చేస్తే కొత్తగా ఇళ్ల మంజూరుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ గెల్లంకి రమేష్, కాగితపల్లి కృష్ణ, పాపినాయుడు, కొండగొర్రి చంటి, గేదెల మోహన్, ఎంపిడిఒ జి.కృష్ణారావు ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని వెంకటంపేటలో అరకు ఎంపి గట్టేటి మాధవి, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి మండలంలోని వెంకంపేటలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇరువురూ కలిసి గడప గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేసిన సంక్షేమ సహాయాన్ని తెలిపి, వారికి ఉన్న అర్హత ప్రకారం సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని పరిశీలించి, అధికారులచే పర్యవేక్షించి అర్హత గల ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పక అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, నాగేశ్వరరావు, ఎంపిపి మజ్జి శోభారాణి, శేఖర్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధరావు, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ తీళ్ల కృష్ణారావు, మాజీ సర్పంచ్ తీల్ల సుభద్రమ్మ, శివున్నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు బి.కృష్ణమూర్తి, కె.సత్యనారాయణ, ఎం.సత్యంనాయుడు, వి.గురురాజు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని వజ్జాయిగూడ సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమాన్ని పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యాన నిర్వహించారు. వజ్జాయిగూడ పంచాయతీ పరిధిలో లిజజ్జువ, గెడ్డగూడ, బోయన్నగూడ, జాతాపు జజ్జువలి గ్రామాల్లో ఆమె పర్యటించారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఆదినారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ మోహన్ రావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు లక్ష్మి, వైసిపి నాయకులు రాము, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సీతంపేట : ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

నేషనల్ హేండ్ రైటింగ్ పోటీల్లో రుషిత బెస్ట్

ప్రజాశక్తి - సాలూరు

సౌత్ ఇండియా స్థాయి హేండ్ రైటింగ్ పోటీల్లో సాలూరు మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన బి.రుషిత మొదటి స్థానం సాధించింది. విశాఖపట్నంలోని ప్రయివేటు కాలేజీలో ఇంటర్ చదువుతున్న రుషిత యుటిఎఫ్ మన్యం జిల్లా సహాధ్యక్షులు బి.విజయకుమార్ కుమార్తె. హేండ్ రైటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రుషితని తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

జియ్యమ్మవలస : మండలంలోని పెద్దమేరంగి పంచాయతీ రామినాయుడు వలసకు చెందిన పుర్రు సంధ్య (28)ఆత్మహత్య చేసుకున్నట్లు చినమేరంగి ఎస్సై జి కళాధర్ తెలిపారు. సోమవారం నాడు వేకువజామున ఇంట్లో ఉన్న ఇనుప వూచకు చీరతో ఉరేసుకుని మరణించిందని తెలిపారు. ఆమెకు పిల్లలు కూడా ఉన్నారని అన్నారు. ఆమె తండ్రి ఎడ్ల గౌరి నాయుడు ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.